జగనన్న పథకాలే విజయానికి సోపానం

- ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు మాకే ఉంది.
- సాక్షితో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



నక్కపల్లి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే మా గెలుపునకు దోహదపడతాయని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. పోలింగ్‌నకు మరికొద్ది రోజులే సమయం ఉన్న తరుణంలో ఆయన 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడిస్తూ గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.

సాక్షి : ఎన్నికల ప్రచార సరళి ఎలా ఉంది?

జోగులు: ప్రచారం చాలా బాగా జరుగుతోంది. ప్రతి గ్రామంలోను ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతున్నారు. ఏగ్రామానికి వెళ్లినా జగనన్న అందించిన సంక్షేమం కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. ప్రచారంలో మాత్రం మేమే ముందంజలో ఉన్నాం.

నియోజకవర్గానికి కొత్త అయిన మీరు ఎన్నికలు ఎలా ఎదుర్కోగలరు?

నియోజకవర్గానికి కొత్త అయినా రాజకీయాలకు పదవులకు కొత్త కాదు. నేను మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశాను. ఇక్కడ సమన్వయకర్తగా నియమితులై దాదాపు 5 నెలలు పూర్తయింది. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటించాను. మా పార్టీలో సమర్థులైన నాయకులు ఉన్నారు. వారి ద్వారా ఇప్పటికే నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఐదేళ్ల పాలనలో మా ప్రభుత్వం 95 శాతం సమస్యలు పరిష్కరించింది.

గెలుపుపై మీ అంచనాలు ఎలా ఉన్నాయి..?

జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే మా పార్టీకి శ్రీరామ రక్ష. ప్రతి కుటుంబంలో జగనన్న ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు వల్ల లబ్ధి పొందారు. వీరంతా మళ్లీ జగనన్న రావాలని కోరుకుంటున్నారు. నియోజకవర్గంలో ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేశాం. 67 గ్రామాల్లో కొత్తగా లేఅవుట్లు ఏర్పాటు చేసి 11వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం. పది వేల మందికి ఇళ్లు మంజూరు చేశాం. కొత్తగా 12వేల మందికి పింఛన్లు మంజూరు చేశాం. నాడు నేడు కింద 156 పాఠశాలల్లో రూ.133 కోట్లు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాం. అలాగే రూ.65 కోట్లతో 110 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాం. రూ.67 కోట్లు వెచ్చించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించి ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ చేశాం. మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే 500 రకాల పనులు జరిగేలా చర్యలు తీసుకున్నాం. రూ. 200 కోట్లతో ఇంటింటికీ తాగునీటి పథకాలను ఏర్పాటు చేశాం. ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే హక్కుమాకే ఉంది.

గడప గడపకు ప్రభుత్వం ప్రభావం చూపుతుందా?

ఈ నియోజకవర్గమే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న చరిష్మాతోనే పార్టీ బలపరచిన అభ్యర్థులంతా విజయం సాధిస్తారు. ప్రతి అభ్యర్థిని ఓటర్లు జగనన్నగా భావిస్తున్నారు. జగనన్న చెప్పాడంటే చేసి చూపిస్తాడన్న నమ్మకంతో ఉన్నారు. తప్పకుండా ఈ ఎన్నికల్లో మేమంతా విజయం సాధిస్తాం. రెండేళ్ల నుంచి మా ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజల్లోనే ఉంటున్నారు. ఈ కార్యక్రమం మా పార్టీకి ఎంతో మైలేజీ తీసుకు వచ్చింది.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ఏవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు?

చంద్రబాబు మాదిరిగా జగనన్న బూటకపు హామీలు ఇవ్వలేదు. గతంలో ప్రకటించిన మేనిఫెస్టోను చేత్తో పట్టుకుని ఈ ఏడాది మేనిఫెస్టో ప్రకటించారు. నవరత్నాలను కొనసాగిస్తూనే అమ్మఒడి, రైతు భరోసా వంటి పథకాలకు కొంత మొత్తాన్ని పెంచడం జరిగింది. అలాగే పింఛన్లు కూడా రూ.3500 చేస్తానని, 2028 నుంచి అమలు చేస్తానని ప్రకటించడం జగనన్న నిజాయితీకి అద్దం పడుతోంది. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాలన్నీ కొనసాగిస్తాం. మేనిఫెస్టోలో చెప్పనివి కూడా గడచిన ఐదేళ్లలో జగనన్న ప్రజల కోసం చేశారు.

టీడీపీ మేనిఫెస్టోపై మీ అభిప్రాయం?

టీడీపీ మేనిఫెస్టో ఒక బూటకం ఇది అమలు సాధ్యం కాదు. బడ్జెట్‌కు మించి హామీలు ఇచ్చేశారు. ఇప్పటికే జగనన్న అమలు చేస్తున్న పథకాల వల్ల రాష్ట్రం శ్రీలంక అవుతుందని ప్రచారం చేసిన టీడీపీ నాయకులు రూ.లక్షా 70 వేల కోట్లు అవసరమయ్యే ఈ పథకాల వల్ల సింగపూర్ అవుతుందా? వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను కాపీ కొట్టారు. ఈ మేనిఫెస్టోను ప్రజలు పట్టించుకోవడం లేదు. అలాగే వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం, జగనన్న చేయూత, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన వంటి పథకాలను కూడా అడ్డుకున్నారు. చంద్రబాబు పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్తారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు నమ్ముతున్నారంటారా?

సూపర్ సిక్స్ పథకాల నుంచి పింఛన్లు పెంపు హామీని తొలగించారు. దీంతోనే ఈ సిక్స్ పథకాలపై ప్రజలకు నమ్మకం పోయింది. ఇది అమలు సాధ్యం కాదని నిర్ధారణ కావడం వల్లే బీజేపీ ఈ మేనిఫెస్టోతో మాకు సంబంధం లేదని ప్రకటించింది. ప్రజలు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు.

నియోజకవర్గ ప్రజలకు మీరు ఇచ్చే హామీలు ఏంటి?

ప్రధానంగా వ్యవసాయ రంగ సమస్యలున్నాయి. తాండవ, వరహానదుల ఆయకట్టు కాలువను పునరుద్ధరిస్తాను, వలసలు నిరోధించడానికి చర్యలు తీసుకుంటాను. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తాను, నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరు ఏర్పాటు చేయిస్తా, నక్కపల్లిలో డిగ్రీ కళాశాలకు నూతన భవనాలు మంజూరు చేయిస్తా, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయిస్తా, వాటర్‌గ్రిడ్‌ను పూర్తిచేయిస్తాను. ఫిష్ లాండింగ్ సెంటర్ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాను.

నర్సీపట్నం దశ..దిశ మారుస్తా

- నియోజకవర్గాన్ని మోడల్‌గా అభివృద్ధి చేస్తా
- సాక్షితో నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి ఉమాశంకర్ గణేష్

సాక్షి ఇంటర్వ్యూ



నర్సీపట్నం : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్ల కాలంలో నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలో ప్రశాంత జీవనానికి నాంది పలికాను. సుదీర్ఘ కాలం పాటు రాజకీయ పదవులు అనుభవించిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, కొడుకులు పట్టణంలో అశాంతిని సృష్టించారు. జగనన్న స్ఫూర్తితో సవాల్‌గా తీసుకొని పరిస్థితులను చక్కదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించా. 2014లో స్వల్ప ఓట్లతో విజయం చేజారినప్పటికీ, 2019 ఎన్నికల్లో 23 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించాను. పార్టీలకు అతీతంగా సేవలు అందించా, మాటలు కాకుండా మున్సిపాలిటీ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అభివృద్ధికి బాటలు చేశాను. పట్టణంలో ప్రశాంత జీవనానికి బాటలు వేశాను. నర్సీపట్నం దశ..దిశ మార్చడమే తన ముందున్న ఏకైక లక్ష్యమని మూడోసారి వైఎస్సార్‌సీపీ నుంచి నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెట్ల ఉమాశంకర్ గణేష్ సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

సాక్షి : మీరు రాజకీయాల్లోకి ఎలా వచ్చారు..?

గణేష్ : మా తల్లిదండ్రులు సింహాచలం, సత్యవతి అలియాస్ అమ్మాజీకి ముగ్గురు కొడుకులం. అన్నయ్య పూరీ జగన్నాథ్ సినీ ఇండస్ట్రీలో ప్రముఖ దర్శకులుగా స్థిరపడ్డారు. తమ్ముడు సాయిరామ్ సినీ హీరోగా స్థిరపడ్డారు. నాన్న సింహాచలం మున్సిబుగా పని చేసేవారు. నాన్నకు నన్ను రాజకీయ నాయకుడుగా చూడాలని కోరిక ఉండేది. నాకు కూడా రాజకీయాల్లోకి రావాలని కోరిక పుట్టింది. కోటవురట్ల మండలం, బాపిరాజు కొత్తపల్లి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించా. 2009 నుండి 2011 వరకు తాండవ జలాశయం చైర్మన్‌గా పని చేశాను. గౌరవ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 2014 వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చింది.

నియోజవర్గ అభివృద్ధికి ఏం చేశారు..?

మున్సిపాలిటీలో దశబ్ద కాలంగా అభివృద్ధికి నోచుకోలేని మెయిన్ రోడ్డును రూ.10.66 కోట్లతో వంద అడుగులు విస్తరించేందుకు శ్రీకారం చుట్టాను. రోడ్డు విస్తరణతో తనకు ఎక్కడ మంచి పేరు వస్తోందోనని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కొంత మందిచేత కేసులు వేయించి రోడ్డు విస్తరణకు అడ్డుపడ్డాడు. అయినప్పటికీ 200 మీటర్ల పొడవున మెయిన్ రోడ్డును వంద అడుగులు విస్తరించి, రోడ్డు విస్తరణ చేస్తే ఇలా ఉంటుందని ప్రజలకు చేసి చూపించాను. గొలుగొండ ఆరిలోవ రోడ్డు విస్తరణకు అయ్యన్నపాత్రుడు అటవీ అనుమతులు తీసుకురావడంలో విఫలమైతే నేను అనుమతులు తీసుకొచ్చి రోడ్డు విస్తరణ పూర్తి చేశాను. అయ్యన్నపాత్రుడు 40 ఏళ్లుగా చేయలేని పనులను నేను చేసి చూపించాను. ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా విజయం సాధించగానే అందరి ఆమోదంతో పూర్తి స్థాయిలో మెయిన్‌రోడ్డును విస్తరిస్తాను. మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతాను. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా నియోజకవర్గంలో 3,87,242 మంది లబ్ధిదారులకు రూ.1302 కోట్ల లబ్ధి చేకూరింది. రూ.500 కోట్లతో నియోజకవర్గానికి మెడికల్ కళాశాల తీసుకువచ్చాను.

ప్రశ్న: టీడీపీ సూపర్ సిక్స్‌పై మీ అభిప్రాయం..?

చంద్రబాబును ప్రజలు నమ్మరు. 2014లో 600 హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీ అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశాడు. మేనిఫెస్టోలో ఇచ్చిన నవరత్నాలను జగనన్న నూటికి నూరు శాతం నెరవేర్చారు. జగనన్న చెబితే చేస్తాడన్న విశ్వాసం ప్రజలో ఉంది. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ స్థాయిలోనే ప్రజలకు సేవలు అందిస్తున్నాం. 2,996 అక్కచెల్లెమ్మల సొంతింటి కలను నెరవేర్చాం.

గెలుపుపై మీ అంచనాలు ఎలా ఉన్నాయి..?

నియోజవర్గ ప్రజలకు అన్ని విధాలా మంచి చేశాను. ఇక్కడ నా గెలుపును ఎవరూ అడ్డుకోలేరు. తమ ప్రభుత్వం అధికారంలో లేనప్పుడే ప్రజలు అఖండ విజయాన్ని అందించారు. ఈసారి కూడా అదే విధంగా విజయాన్ని అందిస్తారు.

ఎమ్మెల్యేగా విజయం సాధించాక చేపట్టనున్న పనులు..?

నర్సీపట్నం మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతా. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తాను. ఏలేరు-తాండవ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి తాండవ ఆయకట్టు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా.

నియోజకవర్గ ప్రజలకు ఏం చెప్పదల్చుకున్నారు.?

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో ముందుకువెళ్తున్నారు. భవిష్యత్తు తరానికి ఉపయోగపడేలా దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చారు. సీఎం సహాయనిధి నుండి రూ.4 కోట్లతో పార్టీలకు అతీతంగా పేదలను ఆదుకున్నాం. రాష్ట్రానికి బంగారు భవిష్యత్ ఇవ్వగల నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. మీ కుటుంబానికి మేలు జరిగితేనే ఓటు వేయండని చెప్పిన దమ్ము ఉన్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. ఇచ్చిన హామీలు నెరవేర్చని చంద్రబాబు మాటలను నమ్మకండి. నర్సీపట్నం అభివృద్ధి, శాంతిని దృష్టిలో పెట్టుకొని మీకోసం పని చేసే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ప్రజలను కోరుతున్నా.

ప్రచార ర్యాలీని విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం : నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలో శనివారం నిర్వహించే ఎన్నికల ప్రచార భారీ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం రమేష్‌పై టీడీపీ రుసరుసలు

- నగదు పంపిణీలో సొంత మనుషులదే పెత్తనం

నక్కపల్లి : అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ స్థానిక టీడీపీ, బీజేపీ నాయకత్వంపై నమ్మకం లేక అన్ని మండలాల్లోనూ తన సొంత మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. నామినేషన్లకు, బహిరంగ సభలకు, ప్రచారాలకు జనాన్ని తరలించే బాధ్యత వారే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఓటర్లకు పోలింగ్ ముందు రోజు ఇచ్చే తాయిలాలు సైతం సీఎం రమేష్ సొంత మనుషుల సమక్షంలోనే పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందుకోసం ఆయన ప్రతి కార్యక్రమంలో స్థానిక నాయకులను కాదని తన సొంత మనుషులను భాగస్వాములను చేస్తున్నారు. వారి కోసం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో లాడ్జీలు, సర్వీసు అపార్ట్‌మెంట్లను, హోటళ్లను ముందుగానే బుక్ చేసుకున్నారు. కడప నుంచి ప్రత్యేక బృందాలను రప్పించి వారి ద్వారా మద్యం, డబ్బులు పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభించారు. దీంతో స్థానిక నాయకులు రమేష్ తీరుపై రుసరుస లాడుతున్నారు. ఆయన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలకే ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వడం కూడా టీడీపీ క్యాడర్‌ను రగిలిపోయేలా చేస్తోంది. ఇక బీజేపీ వారినయితే సీఎం రమేష్ అసలు పట్టించుకోకపోవడంతో వారికి తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి అయ్యే ఖర్చంతా సీఎం రమేష్ భరించడం వల్లే ఆయన ఇలా టీడీపీ వారిని చులకనగా చూస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి జనసేన , టీడీపీలో చేరిన వారి పరిస్థితి ఇప్పుడు రెంటికి చెడ్డ రేవడిగా తయారయింది. ఇదే పార్టీల్లో ఆది నుంచి కొనసాగుతున్న వారు వలస నేతలను దరిదాపుల్లోకి చేరనీయడం లేదు. మొత్తం మీద అభ్యర్థులకు అసలు నాయకులతోను, వలస నాయకులతోను తలనొప్పిగా తయారైంది.

ఆదరించండి...అండగా ఉంటాను..

- వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే కంబాల జోగులు
- పట్టణంలో విస్తృత ప్రచారం



లింగాలకాలనీలో ప్రచార రథంపై నుంచి ఓటర్లకు అభివాదం చేస్తున్న అభ్యర్థి కంబాల జోగులు



మంగవరంలో కంబాల జోగులుకు హారతి ఇస్తున్న మహిళలు



మంగవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కంబాల జోగులు


పాయకరావుపేట : రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మరలా మనందరం జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. ఆయన పాయకరావుపేట పట్టణంలో శుక్రవారం జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావుతో కలిసి ముమ్మరంగా ప్రచారం సాగించారు. లింగాలకాలనీ, కరణంగారి వీధి, పత్రివీధి, పల్లీవీధి, వీవర్స్‌కాలనీలోను ప్రచార రథంపై నుంచి తిరిగి పట్టణ ప్రజలకు అభివాదం చేసుకుంటూ ప్రచారం సాగించారు. ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడుని గెలిపించాలన్నారు. పాయకరావుపేట పట్టణంలో పాటు నియోజకవర్గంలో సమస్యలపై దృష్టి సారించి, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా అందరికీ అందుబాటులో వుంటానన్నారు. అనంతరం ఫ్యాన్ గుర్తు వున్న బ్రోచర్లను ప్రతి ఓటరుకు అందిస్తూ, ఈవీఎంలో ఏవిధంగా ఓటింగ్ చేయాలో పలువురు ఓటర్లకు, వృద్ధులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమల్లేశ్వరరావు, పార్టీ ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ ఇంఛార్జి కంబాల సందీప్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వేమగిరి లక్ష్మణ్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, అన్నవరం దేవస్థానం, డైరెక్టర్ సుందర్రావు, పట్టణ యూత్ అధ్యక్షుడు పిరాధి రాజు, వార్డు సభ్యులు సతీష్, మోహన్, సన్యాసిరావు, మాజీ వార్డు సభ్యులు నాగసూరి, నాయకులు సత్తిబాబు, మహిళా విభాగం నాయకులు శ్రీదేవి, ఉమామహేశ్వరి, వరలక్ష్మి, సీతారత్నం ప్రచారంలో పాల్గొన్నారు. సాయంత్రం మంగవారం గ్రామంలో అభ్యర్థి కంబాల జోగులు ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. సర్పంచ్ వంగలపూడి సరస్వతీ రామారావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, మాజీ సర్పంచ్ మానేపల్లి సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు, కోనే పుత్రరావు, గ్రామశాఖ అధ్యక్షుడు సూరకాసులు అన్నవరం, నాగభూషణం , రమణారావు, కృష్ణ పాల్గొన్నారు.

సర్వసిద్ధిలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



సర్వసిద్ధి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శారదాకుమారి తదితరులు

ఎస్.రాయవరం : వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం విస్తృత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చినగుమ్ములూరు, సర్వసిద్ధి, జేవీపాలెం, గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పేదవాడికి అండగా నిలబడిన జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి,జెడ్పీటీసీ కాకర దేవి, గవర కార్పొరేషన్ డైరక్టర్ కొణతాల ఉమాదేవి, సర్పంచ్‌లు గాడి బుజ్జి, కురందాసు గణేష్, వైఎస్సార్ సీపి నాయకులు మెంత్రెడ్డి గోవిందు, కాసెపు అప్పన్న, సిగిరెడ్డి అప్పారావు, కట్టుమూరి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సినీ నటులు సాయిరామ్‌శంకర్, జోగినాయుడు

నాతవరం : గ్రామాల్లో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తే వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని సినీ హీరో సాయిరామ్ శంకర్, నటుడు లోకవరపు జోగినాయుడు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దారిపొడవునా మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా అందించిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులే ఆయనకు తిరిగి పట్టం కడతారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదని, వైఎస్సార్‌సీపీపైనే ఆసక్తి చూపుతున్నారన్నారు. చంద్రబాబు, అయ్యన్నపాత్రుడు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గణేష్‌ను, ఎంపీగా ముత్యాలనాయుడును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు పి.లక్ష్మీకాంత్, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, సర్పంచ్ గొలగాన రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, డీసీసీబీ డైరెక్టర్ అంకంరెడ్డి పార్వతి, ఎంపీటీసీలు కరక రేణుక, ప్రభావతి, పామాయిల్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పైల పోతురాజు, నూకాంబిక ఆలయ చైర్మన్ అంకంరెడ్డి వెంకటరమణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోలుపర్తి రాధ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెక్కా జోగిరాజు పాల్గొన్నారు.

ఇంటింటా సంతోషం కోసం జగనే కావాలి..



కోటవురట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత నారాయణమూర్తిరాజు

కోటవురట్ల : ప్రతి ఇంటా సంతోషం వెల్లి విరియా లంటే మళ్లీ సీఎంగా జగనే రావాలని ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. కైలాసపట్నంలో ఆయన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఈ ఐదేళ్లలో ప్రతి వర్గానికి సంక్షేమ ఫలాలు అందిస్తూ సువర్ణపాలన అందించారన్నారు. కోటవురట్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆర్.ఎస్.నారాయణమూర్తిరాజు ప్రచారం చేసి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ఇద్దరూ సౌమ్యులని, ఇటువంటి మంచి వ్యక్తులను గెలిపించుకుంటే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖుదాభాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి రమణ, నిమ్మల కృష్ణారావు, కశిరెడ్డి నాగసత్తి, శెట్టి బాబ్జీ, తుమ్మలపల్లి బాబూరావు పాల్గొన్నారు.

